# బదిలీ

పర్వతాలరావు ఇంట్లో అడుగుపెట్టాడు. కోడిగుడ్డు లాంపు నిశ్చలంగా వెలుగుతోంది. గది పూర్తిగా వెలుగ్గానూలేదు, చీకటిగానూలేదు. వెలిసిపోయిన నల్లచీరలా వుంది.

అలసివచ్చిన కొడుకుని చూసి పార్వతి లేచింది. మంచినీళ్ళు తేవటానికి. గదిలో ఒక ప్రక్కగా చాపమీద రమ పడుకునివుంది. చేతులకీ, కాళ్ళకీ గోరింటాకు పెట్టుకునివుంది. అరచేతులమీద లతలు చెరిగిపోకుండా రెండు చేతులూ 'ఇంటూ'లా ముఖంమీంచి వేసుకుని కళ్ళు మూసుకునుంది. పర్వతాలరావు ఉసురుమంటూ పడకకుర్చీలో కూలబడ్డాడు. తల్లి చేతిలోంచి మంచినీళ్ళ గ్లాసు అందుకుని గడగడా తాగేసి చివరిచుక్కలు చేతుల్లో పూసుకుని ముఖానికి పూసుకున్నాడు.

"నీకోసం రాజువచ్చి వెళ్ళాడు" అంది పార్వతి.

"ఊ...ఏమన్నాడు?" అన్నాడు.

"ఏమంటాడూ..." అని సాలోచనగా ఊరుకుని గ్లాసు తీసుకుని బల్లమీద పెట్టింది.

పర్వతాలరావు పేరుకీ, అతనికీ పోలిక లేకపోవడమేకాదు. అతని ఆకారానికి ఆ పేరు విరుద్ధంగా వుంటుంది. అతను సన్నగా, పీలగా, పొట్టిగా నాలుగున్నర అడుగుల ఎత్తుమాత్రమే వుంటాడు. అయితే అతని ముఖంచూస్తే అందంగానే వుంటుంది. అతని కళ్ళు విశాలంగా పొగదేరి వుంటాయి. ముక్కు సూటిగా, మూతి అందంగా వుంటాయి. మూతిమీద

సన్నటి గీతలాంటి మీసంచూస్తే ఇతను ఆడపిల్ల కావల్సి పొరపాటున మగవాడయ్యాడు, ఆ మీసం లేకపోతే అచ్చం ఆడపిల్లే అనుకుంటారు.

నోరు మంచితనంగల పర్వతాలరావు కష్టాలు, కన్నీళ్ళు చిన్ననాటి నుంచి ఆనందంగా అనుభవిస్తూవచ్చాడు. గుమాస్తా ఉద్యోగానికి కావలసిన చదువు అతికష్టంమీద, మేనమామ సాయంవల్ల పూర్తిచేసి చిన్న గుమాస్తాగా చేరాడు. ఆనాటినుండి ఆఫీసులో గొడ్డులా పనిచెయ్యడమేగాని పెదవివిప్పి మాట్లాడి ఎరుగడు. అజాత శత్రువు అతను ఎవరితోనూ ఎక్కువ కలవకపోయినా అందరికీ అంతనంటే ఇష్టం, గౌరవం. అతన్ని చూసి ఎవరూ ఈర్ష్యపడరు. కొంతమంది అకారణంగా జాలి కూడా పడతారు. రెండూ పట్టించుకోడు పర్వతాలరావు.

రమ చాపమీద నిద్రబోతున్నట్లు పడుకుని వుంది. అతను చెల్లెల్నే చూస్తున్నాడు. రమ అచ్చం అన్నలాగే వుంటుంది. అవే ముఖకవళికలు, అదే రూపం-కానీ అదే రూపంలో చిత్రమైన మోటుతనం, గడ్డంక్రింద చిరువెంట్రుకలు, మూతిమీద కనీ కనిపించకుండా వుండే ఎర్రటి వెంట్రుకలు, అన్నగారికంటే ఒక నాలుగంగుళాలు పొట్టి-ఆమె ఫోటో ఎవరైనా చూస్తేఅందమైందే అంటారు. కానీ ఆమె శరీర సౌష్ఠవం చూశాక, ఆమె కనుముక్కు తీరు మర్చిపోతారు.

అతను ఆమెనే చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఈ చెల్లెలికి పెళ్ళి చేయాల్సిన బాధ్యత తనమీద వుంది. తనేం చెయ్యగలడు? రాజు వచ్చి ఏమన్నాడు? అసలు రాజుకి రమంటే ఎందుకిష్టమో పర్వతాలరావుకి ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. ఆలోచించి, ఆలోచించి ఎవరో అన్న సామెత గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు.

రాజు రమని పెళ్ళి చేసుకుంటానన్నాడు. 'కట్నం ఇవ్వలేను' అని తను అనలేదు. 'ఎంతఇస్తావు' అని అతను అడగలేదు. కానీ తను ఎంతో

కొంత ఇవ్వాలి. అతనెంతో కొంత ఆశిస్తాడు. అతనికి మాత్రం ఏముంది? ఒక క్లాస్‌ఫోర్ ఉద్యోగి. ఆమాట ఆలోచించడానికి కూడా సిగ్గేసింది. అసలు తనెవర్ని తెచ్చి చెల్లెలిపెళ్ళి చెయ్యగలడు? చెయ్యలేడు. అలాంటిది అతను చేసుకుంటానంటే తనెంత దూరం ఆలోచిస్తున్నాడు - క్లాస్‌ఫోర్ అయితే నేం?

పర్వతాలరావు ఉద్యోగంలో చేరిన నాటినుండి వచ్చే జీతంలో సగానికి పైగా తల్లి మందులకే ఖర్చు అవుతోంది. డిపార్టుమెంట్ ఇచ్చే మందులకి ఆమె రోగం నయంకాదు. నరకయాతన అనుభవించే తల్లికి తన డబ్బుతో మందులు కొంటేనే, ఉపశమనం కలుగుతుంది. పూర్తిగా రోగం తగ్గదు. అసలు ఎవ్వరూ పూర్తిగా రోగం ఇదీ అని చెప్పలేకపోయారు. ఉండుండి కడుపులో మంట, ఏంతిన్నా వాంతులైపోతాయి. మళ్ళీ ఆకలి - నీరసం.

ఒకసారి ఒకపెద్ద డాక్టరు దగ్గరికి తీసుకెళ్తే కడుపులో ఏదో కంతి లాంటిది వున్నట్లు అనుమానిస్తున్నానని దానికి ఆపరేషన్ చెయ్యాల్సి వస్తుందని చెప్పాడు. డాక్టరు పరీక్ష చేసినందుకే పాతికరూపాయలు ఇచ్చి, ఆమెని మళ్ళీ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళలేకపోయాడు అతను. కారణం ఎప్పుడూ చేతిలో డబ్బుల్లేక పోవడమే.

'ఏమిట్రా ఒకటే ఆలోచన' అన్న పార్వతి మాటలకి ఉలిక్కి పడ్డాడు పర్వతాలరావు.

'రాజు వచ్చాడని చెప్పానుగా' అంది మళ్ళీ. 'ఇంతకీ ఏమిటి?" అంటూ ఆఫీసులో చెయ్యగా మిగిలిపోయిన టి. ఎ బిల్లులు ముందుకు లాక్కున్నాడు.

"అతని కిష్టమేనని చెప్పాడు, అతనేమీ అడక్కపోయినా బొత్తిగా ఏమీ ఇవ్వకపోతే ఏం బావుంటుంది?"

అతను నవ్వాడు. అవును, ఏం బావుంటుంది. కాని తనేం ఇవ్వ గలడు? అసలు తన దగ్గర ఏముంది? తనకి అప్పు మాత్రం ఎవరిస్తారు? ఇచ్చినా, వందా రెండువందలు ఇస్తారు. అది ఏ మూలకి?

"ఒరే పండూ! ఆలోచనమాని నామాట వినరా. అన్ని ఖర్చులూ నేను లెక్కవేశా. ఒక్క పదిహేనువందలు వుంచేదాలు" అంది. ఇంతకీ అదెంతో తక్కువైనట్లూ, తనుగాబట్టి అంత క్లుప్తంగా తేల్చినట్లూ.

ఈసారి పర్వతాలరావు ఫకాలున నవ్వాడు. పార్వతి మాత్రం తల దించుకుని చాప ఈనెలు లాగుతూ ఆలోచిస్తూ..."ఇంతకంటే తక్కువతో ఏమీకాదు" అంది ఖచ్చితంగా. పైకి నవ్వినా అతని మనసులో ఆలోచనల అలలతాకిడి ఎక్కువైంది. అశాంతిగా తలవెనక్కి వాల్చి దూలాలు లెక్క పెట్టడం మొదలుపెట్టాడు. అప్పుడప్పుడు వీచే గాలికి నల్లటి బూజు భయం కరంగా కదులుతోంది.

* * *

పర్వతాలరావు ఆఫీసులో అడుగుపెట్టేసరికి కోలాహలంగా వుంది. టైము పావుగంట దాటినా అంతా గ్రూపులుగా నిలబడి మాట్లాడేసు కుంటున్నారు.

అతను కనిపించగానే—

'పర్వతాలరావుగారూ, మీరు మాత్రం ఊరుకోకండి. జూనియర్స్‌ని వదిలేసి సీనియర్సుని ట్రాన్స్‌ఫర్ చెయ్యడం ఎలా కుదురుతుంది? నోరు లేనివాళ్ళు కనిపిస్తే మరీనూ'—అన్నాడొక శ్రేయోభిలాషి.

"ఇంతకీ ఏం జరిగింది?" అన్నాడు అమాయకంగా.

"మిమ్మల్ని నిర్మల్ ట్రాన్స్‌ఫర్ చెయ్యబోతున్నారు."

"ఎలా తెలిసింది?"

"ఇదిగో హెడ్ ఆఫీసు నుంచి వచ్చాడుగా ఇతను చెప్తున్నాడు".

"ఇంకా ఆర్డర్సు రాలేదుగా" అన్నాడు విశ్రాంతగా.

"అయ్యో! ఇంత అమాయకు లేమిటండీ—ఆర్డర్సు వచ్చాక మీ తరమా మార్చడం" అన్నాడు. ఇంతలో యూనియన్ లీడర్ వెంకటేశ్వర రావు చరచరా వచ్చాడు. "పర్వతాలరావుకి ఎలా ట్రాన్స్‌ఫర్ అవుతుందో చూస్తాం" అంటూ సవాల్ విసిరి మరీ వెళ్ళిపోయాడు.

యూనియన్ నాయకు లందరికీ పర్వతాలరావంటే పంచప్రాణాలు. నిజానికి అతను స్లోగన్లు ఇస్తూ రోడ్డుమీద తిరగడు. నిరాహారదీక్షలకి ముందుండి ఉత్సాహం చూపించడు. అయిన దానికీ కాని దానికీ మేనేజ్ మెంట్‌తో తగవు పెట్టుకుని యూనియన్ తడాఖా చూపించడు. అయినా అతనంటే వాళ్ళకి ప్రాణమే. ఏ సుముహూర్తంలో అతన్ని యూని యన్‌లో మనిషిగా గణించుకున్నారో ఆనాటి నుండి అతను యూనియన్‌కి సంబంధించిన రాతకోతలు, సైపు చెయ్యడాలు, లెక్కలు వ్రాయడాలు, మీటింగ్‌లు ఏర్పాటు చెయ్యడాలు, ఆహ్వాన పత్రాలు వ్రాయడాలు అన్నీ అతనే-ఎలాంటి పేంప్లెట్ వెయ్యాలన్నా పర్వతాలరావు వ్రాసిస్తేగాని వాళ్ళకి పని జరగదు. వీటన్నిటికీ మించిన విషయం అతను ఎక్కువ మాట్లాడడు. ఎవరి దగ్గర ఏ మాట విన్నా అక్కడే మర్చిపోతాడు. ఈ మాటలు మోసే గుణం వున్నవాళ్ళు కూడా, అది లేనివాళ్ళని చూస్తే గౌరవిస్తారు. అందుకే అన్ని జాతుల వాళ్ళకీ అతనంటే అభిమానం.

యూనియన్ లీడర్ హెడ్ ఆఫీసుకి వెళ్ళడం-వ్యవహారం చక్క బెట్టుకుని రావడంతో పర్వతాలరావుకి రావలసిన నిర్మల్ ట్రాన్స్‌ఫర్ మోహనబాబుకి తగిలింది. అతను కుడితిలోపడ్డ ఎలుకలా కొట్టుకున్నాడు.

ఎండ కన్నెరగడు. డబ్బుంది, రెండు మూడు బిజినెస్సులుండి హాబీగా ఉద్యోగం చేస్తున్న అదృష్టవంతుడు మోహనబాబు. అలాంటి

వాడికి ఎక్కడో అడవుల మధ్య నిర్మల్‌కి వెళ్ళాలంటే ఏడుపుకాక - మరేమిటి? అదని దురదృష్టం-అతనే జూనియర్. ఎక్కడెక్కడి పరపతీ అతనికి పనికి రాకుండా పోయింది. గడ్డం పెంచి, దీనంగా తయారైన మోహనబాబుని చూసి కొందరు నవ్వుకున్నారు. కొందరు సానుభూతిగా చూశారు. అతను మాత్రం నిరుత్సాహంగా నీరసపడిపోయాడు.

పర్వతాలరావుకి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. అవును - తను వెనుకంజవేస్తే, మరెప్పుడూ తను చెల్లెలి పెళ్ళి చెయ్యలేడు. అందుకే దృఢ నిశ్చయంతో మోహనబాబుని కలుసుకుందుకు కదిలాడు.

నిర్మల్ వెళ్ళిపోవడానికి హుషారుగావున్న మోహనబాబుని చూసి అంతా ఆశ్చర్యపోయారు.

"అంతే అంతే - ఎంతైనా ఉద్యోగం వదులుకుంటాడా!" అనుకున్నారు.

పర్వతాలరావు చెల్లెలి పెళ్ళికి ముహూర్తం పెట్టించాడు. ఇది విని-

"మంచిపని చేస్తున్నావోయ్ - చిన్నవాడివైనా నిర్వాకస్థుడివి. చెల్లెలి బాధ్యత తీసుకుని సకాలంలో పెళ్ళి చేస్తున్నావు"-అంటూ పెద్దలంతా అతన్ని మెచ్చుకున్నారు.

మోహనబాబు నిర్మల్ వెళ్ళిపోయాడు. పర్వతాలరావు చెల్లెలి పెళ్ళి అయిపోయింది. పెళ్ళైన పదిరోజులు గడిచేలోగా పర్వతాలరావుకి నిర్మల్, మోహనబాబుకి అతని యథాస్థానానికి బదిలీ ఆర్డర్సు వచ్చేశాయి. చంద్రున లేవాడు యూనియన్ లీడర్ మళ్ళీ—

"ఆవేశపడకండి! ఈ బదిలీని అమ్మి, నా చెల్లెలి పెళ్ళి చేశాను. ఇష్టంమీదే వెళ్తున్నా"—అన్న పర్వతాలరావు మాటలకి నిర్ఘాంతపోయాడు లీడర్ వెంకటేశ్వరరావు.